మహిళా సంఘాలకు మొక్కల సంరక్షణ బాధ్యతలు

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట టౌన్, మే 22: అమృత్ 2.0లో విమెన్ ఫర్ ట్రీ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని పుల్లారెడ్డి చెరువు పక్కన మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను పొదుపు సంఘాల సభ్యులకు అప్పగించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ తెలిపారు. పుల్లారెడ్డి చెరువు ప్రాంతంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించి మహిళా సంఘాల సభ్యులు ఇక నుంచి మొక్కలు పెంచి సంరక్షించేందుకు విమెన్ ఫర్ ట్రీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో మహిళలకు ఉపాధి కల్పనతో పాటు పట్టణంలో పచ్చదనం పెంచడం జరుగుతుందని చెప్పారు. మహిళా పొదుపు సంఘాల సభ్యులు చెట్లను పెంచేందుకు స్థల పరిశీలన చేసి అనంతరం మొక్కలు ఎలా పెంచాలో వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ ఎం.కిరణ్, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, టీఓ రాజారెడ్డి, టీఎంసీ శ్వేత, ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్, రంజిత్, శివప్రసాద్, వసీం తదితరులు పాల్గొన్నారు.

'మావోయిస్టులపై హత్యాకాండను ఖండించాలి'

సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

సూర్యాపేట టౌన్, మే 22: అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే కేంద్రంలోని మోదీ సర్కార్ మావోయిస్టుల ఏరివేతకు పూనుకుందని, మావోయిస్టులపై హత్యాకాండను ప్రజా సంఘాలు, మానవతావాదులు ఖండించాలని ఇప్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య, రైతాంగ సమితి నాయకుడు మాధవరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్‌ను ఖండిస్తూ జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఐక్య ప్రజా సంఘాల వేదిక, రైతాంగ సమితి, బహుజన వేదిక ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 26 మంది మావోయిస్టులకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2026 సంవత్సరం నాటికి మావోయిస్టులు లేకుండా చేయాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం నర మేధానికి ఒడిగట్టిందని ఆరోపించారు. ఇప్పటికైనా హత్యాకాండను ఆపాలని, శాంతియుత చర్చలకు సిద్ధమన్న మావోయిస్టు పార్టీ ప్రతిపాదనను కనీసం పట్టించుకోవడం లేదని అన్నారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని అన్నారు. కార్యక్రమంలో ఇప్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు వెంకట్‌యాదవ్, టీపీటీఎఫ్ నాయకుడు ఎస్‌కే.సుభాన్, డీటీఎఫ్ నాయకుడు యోగానందం, పీవైఎల్ నాయకులు వీరబోయిన రమేశ్, దూదిపాల ప్రవీణ్, న్యూడెమోక్రసీ పట్టణ నాయకులు పెద్దింటి అశోక్‌రెడ్డి, రామ సొక్కం తదితరులు పాల్గొన్నారు.

కేశవరావు ఎన్‌కౌంటర్‌పై నిరసన

తుమ్మలపెన్‌పహాడ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు తదితరులు

ఆత్మకూర్.ఎస్, మే 22: మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హత్యను ఖండిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో నల్ల జెండాలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి అల్గుబెల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ కేశవరావును కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసిందని ఆరోపించారు.నంబాల కేశవరావు 55 రోజులుగా కాల్పులు విరమించి శాంతి చర్చలు జరపాలని సూచించారని గుర్తు చేశారు. నిరసన కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, అరుణోదయ నాయకులు ఉమేశ్, కొరివి అంజయ్య, సాయిలు, చంద్రయ్య, జైభీమ్ ఆర్గనైజేషన్ సభ్యుడు నాగరాజు పాల్గొన్నారు.

'ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి'

సూర్యాపేట టౌన్, మే 22: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపుర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తూ గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాటాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాలు చూస్తుంటే ప్రశ్నించే గొంతుకలను లేకుండా చేయాలన్నట్లు ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, నాగయ్య, సంతోషి, పద్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వీరకుమార్

మోతె, మే 22: మండల పరిధిలోని ఉర్లుగొండ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వీరకుమార్ ఆధ్వర్యంలో బ్యాంకుకు సంబంధించి ఇన్సూరెన్స్ పాలసీలు, క్రాప్‌లోన్లు, ఏటీఎం కార్డులు, సైబర్ క్రైమ్, రికరింగ్ డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలని మేనేజర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్బీఐ ఆఫీసర్ గోమతి, ఎఫ్ఐసీ ఆఫీసర్ జగదీశ్, ఫీల్డ్ ఆఫీసర్ రవి, క్యాషియర్ తేజ, క్లర్క్ మహమ్మద్, వహీద్, ఖాతాదారులు పాల్గొన్నారు.

చివ్వెంల మండలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి : ఏపీఎం

చివ్వెంల,మే 22: చివ్వెంల మండలంలో ఏర్పాటు చేసిన అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్లు ఏపీఎం సైదయ్య తెలిపారు. మండల కేంద్రంలో గురువారం సంఘ బంధం సభ్యులతో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశంలో ఏపీఎం పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా మొత్తం 21 కేంద్రాల ద్వారా 3,720 మంది రైతుల నుంచి 2,17,451 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో సీసీలు ఉపేందర్, వెంకన్న, సంఘ బంధం సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100
★సాగర్ రోడ్‌లోగల రెయిన్‌బో వెంచర్ ఫేస్-2 నందు 300 చ॥గల తూర్పు ఫేస్ ప్లాట్ అమ్మబడును. గజం: 5,500/- రూ.లు. సంప్ర॥ 9885650635, 6281714883.
NT-000000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గౌ॥ పట్టణం, మండల కేంద్రాలు.
హైదరాబాద్ : 9182777059 | వరంగల్ : 9182777060 | ఖమ్మం : 9182777061
నిజామాబాద్ : 9182777059 | కరీంనగర్ : 9182777060 | మహబూబ్‌నగర్ : 9182777061
తిరుపతి : 9182777625, 9182777635 | విశాఖపట్నం : 9182777635

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మే 22: రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి రాజీవ్ యువ వికాసం పథకంపై జిల్లా అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నాటికి మండల స్థాయి కమిటీల్లో ఎంపిక పూర్తి చేసి జిల్లాస్థాయికి లబ్ధిదారుల జాబితా అందచేయాలని సూచించారు. జూన్ 2 నాటికి లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌నాయక్, ఎల్‌డీఎం బాపూజీ, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, సంక్షేమ అధికారులు దయానందరాణి, శంకర్, జగదీశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగం భావితరాలకు తెలియజేయాలి

మహనీయుల త్యాగాలు భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని భావించిన భాగ్యరెడ్డి వర్మ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, జగదీశ్వర్‌రెడ్డి, సీపీఓ కిషన్‌నాయక్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీడబ్ల్యూఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళి

భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 22: సంఘ సంస్కర్త, దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ నరసింహ, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుల వివక్ష పొగొట్టడానికి, నిమ్న కులాలకు రిజర్వేషన్ కల్పించడానికి కృషి చేసిన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఓ మంజుభార్గవి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, ఆర్ఐ నరసింహ, పోలీసు సంఘం అధ్యక్షుడు రామచందర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● సెర్ప్ ఏపీఎం కరుణాకర్

నూతనకల్, మే 22: స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ ఏపీఎం కరుణాకర్ అన్నారు. మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో మహిళా సంఘాలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. ప్రతి నెల మొదటి వారంలో మహిళా సంఘాలు తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ప్రతి కుటుంబం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని తెలిపారు. సమావేశంలో సెర్ప్ సిబ్బంది నాగార్జునరెడ్డి, ముత్తయ్య, మల్లేశ్, సరస్వతి, భాగ్యలక్ష్మి, గీత తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను 'బీసీ-ఏ'లో చేర్చాలి

నూతనకల్, మే 22: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చాలని ముదిరాజ్ల సంఘం జిల్లా నాయకుడు బోయిన మహేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో ఏటా రూ.1000 కోట్లు కేటాయించాలని, 50 ఏండ్లు నిండిన మత్స్య కారులకు ఆసరా పింఛన్లు ఇవ్వాలని అన్నారు. చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడితే రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీరస్వామి, వీరకృష్ణ, వెంకన్న, శ్రీనివాస్, యుగేందర్, రాములు, చంద్రయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆయిలపామ్ సాగు లాభదాయకం'

రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేనేజర్ హరీశ్

అర్వపల్లి, మే 22: రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ జె.హరీశ్, వ్యవసాయ విస్తరణ అధికారి నేరేళ్ల సత్యం అన్నారు. మండలంలోని అడివెంల గ్రామంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న మన్నెం సదాశివరెడ్డి తోటలో గెలల కోత, నాణ్యత ప్రమాణాలపై రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజన్ హరీశ్ మాట్లాడుతూ రైతులు ప్రాథమిక దశలోనే సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే మంచి దిగుబడి సాధించవచ్చని చెప్పారు. ఆయిల్‌పామ్ తోటలు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ఎరువులు వేసినట్లయితే నాణ్యమైన దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నారని, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ వి.శశికుమార్, ముత్యంరాజు, రమేశ్, రైతులు ముదిరెడ్డి సంతోశ్‌రెడ్డి, కె.చిన్న తిరుమల్‌రావు, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, సుందర్‌రెడ్డి, ఉమాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, కొండల్‌రెడ్డి, లింగరాజు, బాకు మల్లయ్య, సోమయ్య, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీతో రైతులకు ప్రయోజనం : ఏఓ

ఐలాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

చివ్వెంల, మే 22: ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు అందుతాయని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని ఐలాపురం, జి.తిర్మలగిరి రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారుల చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ ప్రాజెక్టులో భాగంగా ప్రతి రైతుకు 11 అంకెల యూనిక్ ఐడీ కేటాయించి వారికి ఉన్న భూమి రకము, సాగు, వ్యక్తిగత వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఫార్మర్ ఐడీ అనేది రైతులకు అందించే డిజిటల్ గుర్తింపు కార్డు అని, ఇది ఆధార్ కార్డుతో లింక్ అయి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు శైలజ, మానస, రైతులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

● ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి విజ్ఞప్తి

కూలిన ఇంట్లో వెంకన్న దంపతులు

తుంగతుర్తి, మే 22: మండల పరిధిలోని వెంపటి గ్రామంలో బుధవారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి గ్రామానికి చెందిన వెలిశాల వెంకన్న పెంకుటిల్లు కూలిపోయింది. పెంకుటిల్లు కూలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, ప్రభుత్వం స్పందించి తమకు ఇల్లు మంజూరు చేయాలని వెంకన్న వేడుకుంటున్నాడు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే తమను స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు, అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

డ్రైనేజీ లేక అవస్థలు

● నెమ్మికల్ గ్రామంలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని చూపుతున్న గ్రామస్తులు

ఆత్మకూర్.ఎస్, మే 22: మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో బొడ్రాయి నుంచి పాండు రంగని బావి వరకు వెళ్లే రోడ్డులో మురుగు కాల్వలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లలో వాడుకున్న నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీంతో వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మురుగు కాల్వలు నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రైతులకు బోనస్ చెల్లించాలి

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్

ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కోదాడ, మే 22: యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి తక్షణమే బోనస్ డబ్బులు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కోదాడలో ఆర్డీఓ సూర్యనారాయణను రైతులతో కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ పీఏసీఎస్ పరిధిలోని కోదాడ, కొమరబండ, తమ్మర, గుడిబండ, తొగర్రాయి, గణపవరం, కూచిపూడి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యానికి రూ.2.25 కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, కొనుగోళ్లు పూర్తయి 20 రోజులు కావొస్తున్న నేటి వరకు రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ కాలేదని పేర్కొన్నారు. గత వానకాలం సీజన్‌కు సంబంధించి ఇంకా రైతు భరోసా అందని రైతులు ఉన్నారని, వారి ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు కనగాల కొండయ్య, మునగా రాంప్రసాద్, కొండ సురేశ్, లింగరాజు ఉన్నారు.

భయపెడుతున్న వీధి కుక్కలు

● గ్రామాల్లో స్వైర విహారం
● కుక్క కాటుకు గురవుతున్న ప్రజలు
● కుక్కల బెడదను నివారించాలని విజ్ఞప్తి

నూతనకల్‌లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

నూతనకల్, మే 22: మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒక్కో గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో గొర్రెలు, మేకలు, కోళ్లను చంపి తింటున్నాయి. అంతేకాకుండా చాలామంది కుక్కకాటుకు గురవుతున్నారు. రాత్రివేళల్లో వీధుల్లో తిరుగుతూ అరుస్తుండడంతో నిద్రపట్టని పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. చిన్నారులను ఆడుకునేందుకు బయటకు పంపిద్దామంటేనే భయపడే పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్లపై వెళ్తున్న వారిని వెంబడిస్తూ భ్రయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

35 మందికి పైగా కుక్క కాట్లు

గత రెండు నెలల్లో మండలంలో సుమారు 35 మందికి పైగా కుక్క కాటుకు గురైనట్లు నూతనకల్ దవాఖానలోని రికార్డులు చెబుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో వృద్ధులు ఎక్కువగా బాధితులుగా ఉంటున్నారు. మండల కేంద్రం నూతనకల్‌లోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై నిత్యం వందల సంఖ్యలో భారీ, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై కుక్కలు అడ్డు రావడం వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలు వెంబడించడంతో కొన్ని సందర్భాల్లో వాహనాదారులు కిందపడి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా మండలంలోని మాచనపల్లి, లింగంపల్లి, చిల్పకుంట్ల, దిర్శనపల్లి, బిక్కుమళ్ల, మిర్యాల, చిననెమిల, తాళ్లసింగారం తదితర గ్రామాల్లో కుక్కల బెడద అధికమైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనకల్, తాళ్లసింగారం గ్రామాల్లో గత సంవత్సరం కుక్కల గుంపులు గొర్రెల మందలపై దాడి చేసి 50 గొర్రెలను చంపివేశాయి. పలుమార్లు పంచాయతీ పాలకులకు విన్నవించినా కుక్కల బెడద నివారించలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కల బారి నుంచి కాపాడాలి

గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ మనుషులు, పశువులుపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి.ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని తిరగాల్సి వస్తుంది. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలి.

- గుగులోతు కోటేశ్‌నాయక్, మాచనపల్లి

మొక్కల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక

● నర్సరీల్లో చలువు పందిళ్లు ఏర్పాటు
● 475 గ్రామ పంచాయతీల్లో 50.25 లక్షల మొక్కలు

కల్లూరు గ్రామంలోని నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా ఏర్పాటు చేసిన చలువ పందిరి

నేరేడుచర్ల, మార్చి 22: గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణ కోసం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ నిధులతో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఈ నర్సరీల్లో 50,25,870 మొక్కలను పెంచుతున్నారు. వీటిలో నూతనంగా 48,41,070 మొక్కలను పెంచుతుండగా, గతంలోని 5,69,317 మొక్కలు అలాగే ఉన్నాయి. ఈ మొక్కలు ఎండకు ఎండిపోకుండా నర్సరీల్లో మొక్కలపైన గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతకు నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఉపాధి హామీ కూలీల ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లు పోయిస్తున్నారు. కానీ కొన్ని నర్సరీల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మొక్కలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. అధికారులు నిరంతరం పర్యవేక్షించి రానున్న వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉంచేందుకు తగిన చర్యలు చేపట్టారు.

చలువ పందిళ్లు ఏర్పాటు

వచ్చే జూన్ నెల చివరి నాటికి వన మహోత్సవానికి అధికారులు మొక్కలను సిద్ధం చేస్తున్నారు. అప్పటి వరకు మొక్కలు ఎండకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీని కోసం నర్సరీల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి